# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 07-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రజల జ్ఞానం, విలువలు, వారి సామర్థ్యాల్లోనే దేశ అసలైన శక్తి నిబిడీకృతమై ఉందని ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ ఉద్ఘాటించారు.
- ❖ దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ సరఫరా సాధారణంగానే ఉందని, ఎటువంటి కొరత లేదని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.
- ❖ అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఈరోజు సాయంత్రంతో ముగిసింది.
- ❖ దేశంలో ఆహార భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు, అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యతని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలియజేశారు.
- ❖ ఢిల్లీ, చండీగఢ్, హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో రానున్న రెండు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది.

=====================

అసోం, కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఈరోజు సాయంత్రంతో ముగిసింది. పోలింగ్ ముగియడానికి 48 గంటల ముందు అమల్లోకి వచ్చే `నిశ్శబ్ద కాలం` ఆయా రాష్ట్రాలలో ప్రారంభమైంది. ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. గురువారం జరగనున్న పోలింగ్‌కు ఎన్నికల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు భద్రతను కట్టుదిట్టం చేశారు. కేరళంలో మొత్తం 76 వేల మంది పోలీసు సిబ్బందిని విధుల్లో మోహరించారు. వీరికి అదనంగా కేంద్ర బలగాలకు చెందిన 160 బృందాలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పహారా కాస్తున్నాయి. అసోంలో మొత్తం 126 అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 722 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చూడటానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అదే విధంగా కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఈరోజు సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగిసింది. ఈనెల 9న పుదుచ్చేరిలోని మొత్తం 30 అసెంబ్లీ నియోజకవర్గాలకు

పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 294 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రభుత్వం ఆ రోజున వేతనంతో కూడిన సెలవు (Paid Holiday) ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశ అసలైన శక్తి ప్రజల జ్ఞానం, విలువలు, వారి సామర్థ్యాల్లోనే నిబిడీకృతమై ఉందని ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (IGNOU) 39వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ... 2047 నాటికి `వికసిత్ భారత్` లక్ష్యాన్ని చేరుకోవడంలో ఇగ్నో వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. నూతన జాతీయ విద్యా విధానం (NEP) అమలు ద్వారా దేశ విద్యావ్యవస్థ మరింత పటిష్టమవుతుందని, ఇది ఉపాధి కల్పనలో కీలక మార్పులు తెస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఆహార భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు.. అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. జైపూర్‌లో ఈరోజు నిర్వహించిన `ప్రాంతీయ వ్యవసాయ సదస్సు`లో ఆయన మాట్లాడుతూ... వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం బహుముఖ వ్యూహాలతో పటిష్టమైన చర్యలు చేపడుతోందని వెల్లడించారు. రైతులు స్వయం సమృద్ధి సాధించాలంటే సాగులో వైవిధ్యీకరణ అత్యవసరమని పేర్కొన్నారు. ఆధునిక సాగు పద్ధతులు, సమగ్ర వ్యవసాయ విధానాలను అనుసరించడం ద్వారానే రైతు సాధికారత సాధ్యమవుతుందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే అక్రమ చొరబాటుదారులందరినీ వెనక్కి పంపుతామని బీజేపీ సీనియర్ నాయకులు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అసోంలోని పాతర్‌కండీలో ఈరోజు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఐదేళ్లలో అసోంను దేశంలోని ఇతర అభివృద్ధి చెందిన రాష్ట్రాల సరసన నిలపడమే బీజేపీ లక్ష్యమని పేర్కొన్నారు. అసోం సర్వతోముఖాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా అమిత్ షా పునరుద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ (LPG), పీఎన్‌జీ (PNG) సరఫరా సాధారణంగానే ఉందని, ఎక్కడా ఎటువంటి కొరత లేదని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర మంత్రిత్వ శాఖల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని పెట్రోల్ బంకులు యథావిధిగా పని చేస్తున్నాయని, సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్ల డెలివరీ సజావుగా సాగుతోందని, ఆన్‌లైన్ బుకింగ్‌లు 96 శాతానికి పెరిగాయని చెప్పారు. వాణిజ్య అవసరాల గ్యాస్ కేటాయింపులను సంక్షోభ పూర్వ స్థాయికి పెంచినట్లు సుజాత శర్మ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, ఆఫ్రికా దేశాల మధ్య దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న చారిత్రక సంబంధాలు, ప్రజల మధ్య ఉన్న పటిష్టమైన అనుబంధాన్ని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ కొనియాడారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `భారత్-ఆఫ్రికా సంబంధాల` పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆఫ్రికా ఖండంలోని దేశాలతో భారతదేశం కొనసాగిస్తున్న దౌత్యపరమైన చొరవపై కమిటీ సభ్యులతో విస్తృతంగా చర్చించారు. సెంట్ కిట్స్ అండ్ నెవిస్ విదేశాంగ మంత్రి డాక్టర్ డెంజిల్ ఎల్. డగ్లస్‌తో జైశంకర్ భేటీ అయ్యారు. ఈ భేటీలో ప్రధానంగా అభివృద్ధి ప్రాజెక్టులు, ఆరోగ్య రంగంలో పరస్పర సహకారం.. డిజిటల్ సామర్థ్యాల పెంపుదల వంటి అంశాలపై దృష్టి సారించినట్లు జైశంకర్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఆహార శుద్ధి రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (PLISFPI) ఉత్సాహపూరిత ఫలితాలను సాధించింది. ఈ పథకం కింద ఇప్పటివరకు 9 వేల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు వచ్చాయి. ఇది ప్రారంభంలో ప్రకటించిన 7 వేల కోట్ల రూపాయల పెట్టుబడి అంచనాలను మించి ఉందని కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలియజేసింది. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో ఆ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి డి. ప్రవీణ్ మాట్లాడుతూ... పీఎల్ఐ పథకం వల్ల ఉత్పత్తుల అమ్మకాలు 10.58 శాతం, ఎగుమతులు 7.4 శాతానికి పెరిగాయని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధికారంలోకి వస్తే పారిశ్రామికీకరణకు పెద్దపీట వేస్తామని, యువతకు భారీగా ఉపాధి కల్పిస్తామని ఆ పార్టీ సీనియర్ నాయకులు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు. ఉత్తర 24 పరగణాల జిల్లా బ్యారక్‌పూర్‌లో ఈరోజు జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నూతన వేతన సవరణ (పే కమిషన్) అమలు చేస్తామని ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ 15 సంవత్సరాల పాలనకు త్వరలోనే చరమగీతం పాడుతామని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

`వందేమాతరం` స్ఫూర్తిని వెండితెరపై ఆవిష్కరించేందుకు గాను 'కేంద్ర సాంస్కృతిక శాఖ' చలనచిత్ర నిర్మాతలు, సృజనాత్మక కళాకారుల కోసం `వందేమాతరం ఫ్రేమ్స్` (Vande Mataram Frames) పేరిట జాతీయ స్థాయి లఘు చిత్రాల పోటీ నిర్వహిస్తోంది. జాతీయ గీత వైభవాన్ని చాటిచెప్పేందుకు ఈ పోటీ ఒక వేదికగా నిలవనుందని మంత్రిత్వ శాఖ తెలియజేసింది. కళాకారులు తమలోని సృజనాత్మకతను, సాంకేతిక ప్రతిభను ప్రదర్శించడంతో పాటు.. దేశ భక్తిని సినిమా రూపంలో ప్రపంచానికి చాటి చెప్పవచ్చని పేర్కొంది. ఈ పోటీలో వ్యక్తులుగా లేదా బృందాలుగా ఎవరైనా పాల్గొనవచ్చు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఎంట్రీలను http://vandemataram150.in అనే వెబ్‌సైట్ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న మూడు రోజుల పాటు ఈశాన్య భారత్ సహా పలు ఉత్తరాది రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం పేర్కొంది. ఉత్తరాఖండ్, హిమాలయ పరిసర మైదాన ప్రాంతాలు, మధ్య భారత్, ఒడిశాతో పాటు కోస్తాంధ్రప్రదేశ్‌లోని పలుచోట్ల రానున్న మూడు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది. మరోవైపు.. ఢిల్లీ, చండీగఢ్, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో రానున్న రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

పొరుగు దేశం సీషెల్స్ కు భారత్ 250 మెట్రిక్ టన్నుల మొదటి విడత ఆహార ధాన్యాలను ఈరోజు పంపించింది. ఈ మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమాల వేదికగా వివరాలను వెల్లడించింది. సెషెల్స్ అభివృద్ధి కోసం భారత్ గతంలో ప్రకటించిన 175 మిలియన్ డాలర్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీలో భాగంగా ఈ సహాయాన్ని అందిస్తోంది. ప్రస్తుతం 250 మెట్రిక్ టన్నుల ధాన్యంతో పాటు.. రాబోయే రోజుల్లో మరిన్ని విడతలుగా ఆహార ఉత్పత్తులు, ఇతర నిత్యావసరాలను భారతదేశం పంపించనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =